# మేలైన చేదు..



ఇంట్లో ..! అమ్మ కాకరకాయ వండిందంటే చాలు 'అమ్మో! ఆ చేదు మేము తినలేమ'ంటూ స్విగ్గీలో నచ్చిన ఐటం ఆర్డర్ పెట్టుకుంటాం. లేదంటే అప్పటిప్పుడు వేరే కూరైనా వండించుకొని తింటాం. కానీ మన శరీరానికి కాకరకాయ ఎంతో మేలు చేస్తుంది. మరీ ముఖ్యంగా వర్షాకాలంలో మనల్ని ఆరోగ్యంగా ఉంచడంలో కాకరకాయది ప్రథమస్థానం. మన శరీరంలోని రోగనిరోధక శక్తిని బలోపేతం చేసి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా రక్షిస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తుల రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గించడమే కాకుండా శరీరంలోని కొలెస్ట్రాల్‌ను కాకరకాయ నియంత్రిస్తుంది. కాకరకాయలో ఉన్న విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్, పాలీఫెనాల్స్ లాంటి పోషకాలు యాంటి ఆక్సిడెంట్లుగా మారి వానాకాలంలో జలుబు, దగ్గు, ఇతర ఇన్ఫెక్షన్ల నుంచి మనల్ని కాపాడుతాయి. ఫంగల్ ఇన్ఫెక్షన్లు, దురదతో బాధపడేవారికి ఉపశమాన్ని కలిగిస్తాయి. కాకరకాయ కాలేయం పనితీరును మెరుగుపరుస్తుంది. రక్తాన్ని శుద్ధి చేయడమే కాకుండా శరీరంలోని ట్యాక్సిన్స్‌ని మూత్రం రూపంలో బయటికి పంపిస్తుంది.

## వాము గింజల నీళ్లను ఇలా తయారు చేసి రోజూ తాగండి..
# అనేక లాభాలు ఉంటాయి!



వాము గింజలను మనం తరచూ వంటల్లో ఉపయోగిస్తుంటాం. దాదాపుగా ప్రతి ఒక్కరి ఇంట్లోనూ ఇవి ఉంటాయి. ఇవి ఘాటైన రుచిని కలిగి ఉంటాయి. కానీ అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వాము గింజలను నేరుగా తినలేరు. కానీ వీటితో నీళ్లను తయారు చేసి తాగవచ్చు. ఒక పాత్రలో నీటిని తీసుకుని కొన్ని వాము గింజలను అందులో వేసి మరిగించి అనంతరం వచ్చే నీళ్లను వడకట్టి తాగవచ్చు. లేదా రాత్రి పూట వాము గింజలను నీటిలో నానబెట్టి మరుసటి రోజు ఉదయం ఆ నీళ్లను పరగడుపునే తాగవచ్చు. అతిగా భోజనం చేసినప్పుడు ఈ నీళ్లను తాగితే ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. వాము నీళ్లలో బ్లాక్ సాల్ట్ లేదా నిమ్మరసం, తేనె వంటివి కలిపి తాగితే ఇంకా ఎక్కువ లాభాలు కలుగుతాయి. వాము నీళ్లను రోజుకు ఒక గ్లాస్ మోతాదులో తాగితే చాలు, అనేక లాభాలను పొందవచ్చు.

**జీర్ణ వ్యవస్థ పనితీరుకు..**

వాము నీళ్లను తాగడం వల్ల జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. ఇవి మనం తిన్న ఆహారాన్ని సులభంగా జీర్ణం చేస్తాయి. దీంతో అజీర్తి తగ్గుతుంది. అలాగే కడుపు ఉబ్బరం, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. వాము సహజసిద్ధమైన డీ కంజెస్టెంట్‌గా పనిచేస్తుంది. అందువల్ల ఈ నీళ్లను తాగితే ఈ గింజల్లో ఉండే థైమోల్ అనే సమ్మేళనం గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫాన్ని బయటకు పంపిస్తుంది. దీంతో దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ, ముక్కు కారడం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఆస్తమా ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయి. వాము గింజల నీళ్లను తాగితే శరీర మెటబాలిజం పెరుగుతుంది. దీంతో శరీరం క్యాలరీలను త్వరగా ఖర్చు చేస్తుంది. దీని వల్ల కొవ్వు కరిగి బరువు తగ్గుతారు. మనం తిన్న ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు వెళ్లిపోతాయి. వాము గింజల్లో యాంటీ స్పాస్మోడిక్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ నీళ్లను సేవిస్తుంటే కండరాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే స్త్రీలు రుతు సమయంలో ఈ నీళ్లను తాగితే అధిక రక్తస్రావం జరగకుండా జాగ్రత్త పడవచ్చు. అలాగే కడుపు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. వాము నీళ్లలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు సైతం ఉంటాయి. ఇవి నొప్పులను, వాపులను తగ్గిస్తాయి. ముఖ్యంగా కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్ వంటి సమస్యలు ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. వాము గింజల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్త నాళాలను వెడల్పుగా చేసి వాటిల్లో ఉండే వ్యర్థాలను బయటకు పంపుతాయి. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ తగ్గుతుంది. గుండె పోటు రాకుండా చూసుకోవచ్చు. వాము గింజలను తింటున్నా, వాటి నీళ్లను తాగుతున్నా ఇలా అనేక లాభాలను పొందవచ్చు. అయితే ఈ నీళ్లు అందరికీ పడవు. పొట్టలో అసౌకర్యం ఏర్పడే అవకాశాలు ఉంటాయి. అలాంటి వారు ఈ నీళ్లను తాగకూడదు. అలాగే గర్భిణీలు ఈ నీళ్లకు దూరంగా ఉండాలి. రక్తాన్ని పలుచగా చేసే మందులను వాడే వారు కూడా ఈ నీళ్లను తాగకూడదు.

## బకాసురిడిలా తిన్నా బొజ్జ పెరగదు..?
# ఈ టిప్స్‌తో పొట్టకు మేలు..



తరచుగా ఏదో ఒకటి తినే అలవాటు ఉన్నవారికి బరువు తగ్గడం అనేది ఒక సవాలుగా మారుతుంది. ఈ మధ్య దేశంలో ఎంతో ఊబకాయంతో బాధపడుతున్నారని ఓ సర్వే తెలిపింది. అయితే ఆహారం ఎక్కువగా తింటూ కూడా బరువును అదుపులో ఉంచుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఎంత తిన్నా బరువు పెరగకుండా ఉండే చిట్కాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం..

కేలరీల లోటు అంటే ఏమిటి?

బరువు తగ్గడానికి ముఖ్యమైన సూత్రం 'కేలరీల లోటు' అంటే శరీరానికి అవసరమైన కేలరీల కంటే తక్కువ కేలరీలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం. అవును ప్లేట్ నిండా తినాలి. కానీ అందులో అధిక కేలరీలు ఉన్న ఆహారానికి బదులుగా, తక్కువ కేలరీలు ఉన్న ఆహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలి. ఈ విధంగా ఆహారం ఎక్కువగా తిన్న సంతృప్తి లభిస్తుంది.. కానీ శరీరానికి తక్కువ కేలరీలు అందుతాయి.

ఎలాంటి ఆహారం తీసుకోవాలి?

పండ్లు: స్ట్రాబెర్రీలు, పుచ్చకాయ, కివి, చెర్రీ వంటి తక్కువ కేలరీలు ఉన్న పండ్లను ఎంచుకోండి.

మాంసం: చికెన్ బ్రెస్ట్, రొయ్యలు, టిలాపియా లేదా ఇతర తెల్ల చేపలు, ట్యూనా వంటివి తీసుకోవచ్చు.

కార్బోహైడ్రేట్లు: కిడ్నీ బీన్స్, ఉడికించిన బంగాళాదుంపలు, చిలగడదుంపలు, కాయధాన్యాలు, బఠానీలు వంటివి మంచి ఎంపికలు.

సమస్య మీరు ఎంత తింటున్నారనేది కాదు మీరు తినే ఆహారంలో ఎన్ని కేలరీలు ఉన్నాయనేది ముఖ్యం. తక్కువ కేలరీల ఆహారాలను ఎక్కువగా తినడం ద్వారా, మీరు ఆకలిని తీర్చుకోవడమే కాకుండా బరువును సమర్థవంతంగా అదుపులో ఉంచుకోవచ్చు. ఈ చిట్కాలను అనుసరిస్తే మీరు కూడా ఎక్కువగా తింటూనే ఆరోగ్యంగా ఉండవచ్చు.

## గుమ్మడికాయ విత్తనాలను అసలు రోజుకు ఎన్ని తినాలి..?
# ఏ సమయంలో, ఎలా తింటే మంచిది..?



ప్రస్తుతం చాలా మంది ఆరోగ్యకరమైన ఆహారాలను తింటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే మనకు వివిధ రకాల పౌష్టికాహారాలు కూడా అందుబాటులో ఉంటున్నాయి. ఇక అలాంటి వాటిల్లో గుమ్మడికాయ విత్తనాలు కూడా ఒకటి. అయితే వీటిని రోజూ ఎలా తినాలి, ఎన్ని తినాలి, ఏ సమయంలో తినాలి.. అని చాలా మంది సందేహాలను వ్యక్తం చేస్తుంటారు. ఇందుకు పోషకాహార నిపుణులు ఏమని సమాధానాలు చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. గుమ్మడికాయ విత్తనాలను నీటిలో నానబెట్టి తినాల్సి ఉంటుంది. కనీసం 6 నుంచి 8 గంటలపాటు లేదా రాత్రంతా నీటిలో నానబెట్టి తరువాత తినాలి. వీటిని రోజుకు ఒక గుప్పెడు మోతాదులో లేదా 30 గ్రాముల వరకు తినవచ్చు. వీటిని ఉదయం లేదా సాయంత్రం తినాల్సి ఉంటుంది. గుమ్మడికాయ విత్తనాలను తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

**శరీరంలో శక్తి స్థాయిలకు..**

గుమ్మడికాయ విత్తనాల్లో మన శరీరానికి అవసరం అయిన అనేక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా మెగ్నిషియం, జింక్, ఐరన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. 30 గ్రాముల గుమ్మడికాయ విత్తనాలను తింటే సుమారుగా 150 క్యాలరీల శక్తి లభిస్తుంది. అందువల్ల వీటిని ఉదయం తింటే రోజంతా శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. ఉత్తేజంగా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. మెదడు సైతం యాక్టివ్ గా పనిచేస్తుంది. నీరసం, అలసట ఉండవు. బద్ధకం పోతుంది. శరీర శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. ఈ విత్తనాలను తింటే ఫైబర్ అధికంగా లభిస్తుంది. ఇది జీర్ణశక్తిని మెరుగు పరుస్తుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తుంది. అయితే గుమ్మడికాయ విత్తనాలను మోతాదులోనే తినాలి. అధికంగా తింటే గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్దకం వచ్చే అవకాశాలు ఉంటాయి.

**జీవక్రియల నిర్వహణకు..**

గుమ్మడికాయ విత్తనాల్లో మెగ్నిషియం అధికంగా ఉంటుంది. ఇది మన శరీరంలో 300కు పైగా జీవక్రియలను నిర్వహించేందుకు సహాయం చేస్తుంది. బీపీని నియంత్రిస్తుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. కండరాలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. ఎముకలను గట్టి పరుస్తుంది. శరీరంలో శక్తి ఉత్పత్తి అయ్యేందుకు సహాయం చేస్తుంది. ఈ విత్తనాల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. బీపీని తగ్గిస్తాయి. కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతాయి. దీంతో హృదయ సంబంధిత వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

**పురుషుల ఆరోగ్యానికి..**

గుమ్మడికాయ విత్తనాలను తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుకోవచ్చు. వీటిల్లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు రక్తంలో గ్లూకోజ్ నెమ్మదిగా విడుదల అయ్యేలా చేస్తాయి. దీంతో షుగర్ లెవల్స్ ఎల్లప్పుడూ తక్కువగా ఉంటాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. గుమ్మడికాయ విత్తనాల్లో ట్రిప్టోఫాన్ అనే సమ్మేళనం సహజసిద్ధంగా లభిస్తుంది. ఇది నిద్రను ప్రోత్సహిస్తుంది. దీని వల్ల మన శరీరంలో సెరొటోనిన్, మెలటోనిన్ అనే హార్మోన్లు ఉత్పత్తి అవుతాయి. ఇవి ఒత్తిడి, ఆందోళనను తగ్గించి మైండ్ రిలాక్స్ అయ్యేలా చేస్తాయి. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. గుమ్మడికాయ విత్తనాలు పురుషుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని తింటే వీటిల్లో ఉండే జింక్ ప్రోస్టేట్‌ను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీంతోపాటు మూత్రాశయ సమస్యలు కూడా రాకుండా అడ్డుకోవచ్చు. ఇలా గుమ్మడికాయ విత్తనాలను రోజూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

## పసుపు, తేనె మిశ్రమాన్ని రోజూ ఇలా తీసుకోండి..
# ఎన్నో అద్భుతమైన లాభాలు కలుగుతాయి..!



పసుపు, తేనె.. ఇవి రెండూ మన ఇళ్లలో ఉండేవే. వీటిని మనం రోజూ అనేక రకాలుగా వాడుతుంటాం. పసుపును వంటల్లో వేస్తాం. తేనెను పానీయాల్లో కలిపి తాగుతాం. అయితే మీకు తెలుసా..? పసుపు, తేనె మిశ్రమం ఎన్నో రోగాలకు అద్భుతమైన ఔషధంగా పనిచేస్తుందని ఆయుర్వేదం చెబుతోంది. ఈ మిశ్రమాన్నే గోల్డెన్ హనీ అని కూడా అంటారు. ఈ రెండు పదార్థాలది చాలా శక్తివంతమైన కాంబినేషన్. దీన్ని తీసుకుంటే అనేక రోగాలను నయం చేసుకోవచ్చు. అనేక లాభాలు కలుగుతాయి. ఒక టీస్పూన్ తేనెలో పావు టీస్పూన్ పసుపు కలిపి నేరుగా అలాగే ఉదయాన్నే తినవచ్చు. లేదా పసుపును నీటిలో వేసి మరిగించి ఆ నీటిలో కాస్త తేనె కలిపి తాగవచ్చు. పెరుగులోనూ ఈ రెండింటినీ కలిపి తీసుకోవచ్చు. అయితే ఈ మిశ్రమానికి మిరియాల పొడిని కూడా కలిపితే ఇంకా పవర్‌ఫుల్‌గా మారుతుంది. దీని వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

**నొప్పులు, వాపులకు..**

ఈ మిశ్రమంలో కర్క్యుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఇన్‌ఫ్లామేటరీ సమ్మేళనంగా పనిచేస్తుంది. అందువల్ల ఈ మిశ్రమాన్ని తీసుకుంటే శరీరంలో బాహ్యంగా, అంతర్గతంగా ఉండే వాపులు తగ్గిపోతాయి. శరీరంలో అంతర్గతంగా ఉండే అవయవాలు, రక్త నాళాల వాపులు తగ్గుతాయి. దీంతో గుండె పోటు రాకుండా చూసుకోవచ్చు. అలాగే ఆర్థరైటిస్ వంటి కీళ్ల సమస్యలు తగ్గుతాయి. కీళ్ల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ మిశ్రమంలో ఉండే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు మన శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగించి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. క్యాన్సర్ కణాలు నాశనం అవుతాయి. పలు రకాల క్యాన్సర్లు రాకుండా చూసుకోవచ్చు.

**సీజనల్ వ్యాధులకు చెక్..**

పసుపు, తేనె మిశ్రమం ఇమ్యూనిటీ బూస్టర్‌గా పనిచేస్తుంది. ఇందులో యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. ఇవి ఇన్ఫెక్షన్లను తగ్గిస్తాయి. సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు, గొంతు నొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. ఈ మిశ్రమాన్ని తీసుకుంటే ప్రీ బయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. దీంతో పైత్య రసాలు సరిగ్గా ఉత్పత్తి అవుతాయి. ఇవి మనం తిన్న ఆహారంలో ఉండే కొవ్వులను సరిగ్గా జీర్ణం చేస్తాయి. దీంతో అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి జీర్ణ సమస్యలను తగ్గించుకోవచ్చు.

**గుండె ఆరోగ్యానికి..**

పసుపు, తేనె మిశ్రమంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్న కారణంగా గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ఈ మిశ్రమాన్ని తీసుకుంటే రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గి గుండె జబ్బులు రాకుండా ఉంటాయి. ఈ మిశ్రమంలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్న కారణంగా దీన్ని తీసుకుంటే మొటిమలు, మచ్చలు, చర్మంపై ఉండే దురద, దద్దుర్లు వంటి సమస్యలు తగ్గిపోతాయి. చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. ఈ మిశ్రమాన్ని ఫేస్ ప్యాక్‌లా కూడా ఉపయోగించవచ్చు. దీంతో ఇంకా ఎక్కువ ఫలితం ఉంటుంది. ఇలా పసుపు, తేనె మిశ్రమం మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది.

